

## ఆస్పత్రికి వచ్చే వారు బాధ్యతగా మెలగాలి

ఆస్పత్రికి వచ్చే బాధితులను కుటుంబ సభ్యుల వలే సాకుతున్నాం. ఆప్యాయంగా వైద్య సేవలు అందిస్తున్నాం. అటువంటి తమపై కొంత మంది ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నారు. రోగులతో పాటు సహాయకులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యులకు సహాయకులుగా మహిళా సిబ్బంది ఉండాలి. సెక్యూరిటీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి.

– డాక్టర్ రూపా, 59వ వార్డు యూపీహెచ్‌సీ వైద్యురాలు



## అదనపు సిబ్బందిని డ్యూటీలో ఉంచాలి

నైట్ డ్యూటీలో ఉన్న మహిళ వైద్యులతో పాటు ఫిమేల్ అటెండర్,ఇతర సిబ్బందిని ఉంచాలి. రాత్రులు ఆస్పత్రికి రోగితో పాటు వచ్చే కొంత మంది వైద్యులను చులకనగా మాట్లాడడం, కొంత మంది సహనం కోల్పోయే విధంగా ప్రవర్తిస్తుండడం చాలా ఇబ్బంది కరంగా ఉంటుంది.అలాంటి సమయాల్లో నైట్ డ్యూటీ చేసే వైద్యురాలితో పాటు అదనపు సిబ్బంది ఉంటే వైద్యులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తదు.

– డాక్టర్ ఐశ్వర్య, మెడికల్ ఆఫీసర్, ఇందిరాకాలనీ యూపీహెచ్‌సీ

## క్లుప్తంగా

### ఉక్కును కాపాడుకుంటాం

అగనంపూడి: ఆంధ్రుల ఆత్మ గౌరవంతో ముడి పడి ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకొనే శక్తి, యుక్తి రాష్ట్ర ప్రజలకు ఉందని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, హరనాథ్, సత్యనారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆదివారం వారు మాట్లాడారు. లక్షల కోట్ల విలువైన ఆస్తులు, లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును అతి తక్కువ ధరకు అమ్మేయాలని చూస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకోబోరన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.వి.రమణ, శీరంశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ) : ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విశాఖపట్నం నగరానికి చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. నగరంలోని శ్రీహరిపురానికి చెందిన డి.చలపతి, కుందన, జ్యోతి, నిఖిత పేరిట డి.కృష్ణమూర్తిరెడ్డి ఆలయ ఈవో కె.ఎస్.రామరావుకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

### పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

మురళీనగర్ : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (గైస్) సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీతోపాటు అక్కడ పనిచేసే ఉద్యోగుల భద్రత సేఫ్టీ విభాగం సిబ్బంది పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ కోర్సులు చేసిన వారికి విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం సేఫ్టీ పోకస్ పత్రికను ఆయన ఆవిష్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్ఆర్ సురేష్, ఆర్.మాధవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

పీఎం పాలెం: గుర్తు తెలియని ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఒక వ్యక్తి మృతికి కారకుడయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలిలా.. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన పగడాల రమణ(50) అనే వ్యక్తి విశాఖ నగరంలోని పెట్రోల్ బంకుల వద్ద జరిగే పనుల్లో కూలీగా చేస్తుంటాడు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో సహచర కూలీ దాస్‌తో కలిసి కొమ్మాది నుంచి కార్‌షెడ్ కూడలికి వచ్చే ఆటో ఎక్కాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో పగడాల రమణ కిందకు పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆటో డ్రైవర్ క్షతగాత్రుడిని కనీసం పట్టించుకోకుండా సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. రమణను వెంటనే వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా.. అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుమార్తె నీలిమ శనివారం రాత్రి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.



# ఈ సారైనా నిబద్ధతతో సాగేనా!

- చిత్తశుద్ధి కరువైన ప్లాస్టిక్ నిషేధం
- అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గోపాలపట్నం బంక్ జంక్షన్ దుకాణదారుడితో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంతనాలు



స్వీట్ దుకాణం వద్ద స్వీట్ బాక్స్ అందుకుంటున్న సిబ్బంది(ఫైల్)



బంక్ సెంటర్‌లో మాంసం దుకాణం వద్ద పరిశీలన చేస్తున్న ఎకో వైజాగ్ టీమ్

గోపాలపట్నం: ప్లాస్టిక్ నిషేధం మళ్లీ తెరపైకి వచ్చింది. దుకాణలపై ఆకస్మిక దాడులు మొదలయ్యాయి. ఈ సారైనా మూణ్నాళ్ల ముచ్చట కాకుండా.. మామూళ్లకు లొంగకుండా పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

కొంత కాలంగా ప్లాస్టిక్ నిషేధం అంటూ అధికారులు గొంతు చించుకున్నారు. ప్రత్యేక నిఘా పెట్టారు. దుకాణా దారులపై దాడులు చేశారు. జీవీఎంసీ అధికారులు చేసిన ప్రయత్నాన్ని అంతా అభినందించారు. చాలా మంది దుకాణ దారులు ప్లాస్టిక్ సంచులు వాడడం మానేశారు. ఆర్థికంగా భారమైనా ప్రత్యామ్నాయ సంచుల్లో అమ్మకాలు చేశారు. తర్వాత అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో మళ్లీ యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వినియోగిస్తున్నారు.

**ఎన్‌ఫోర్స్ టీమ్‌కు కాసుల పంట!**

విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎకో వైజాగ్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారి కోసం వాహనాలు కేటాయించారు. వీరు ఈ వాహనాల్లో నగరంలో తిరుగుతూ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ సంచులు అమ్మకాలు జరగ కుండా చర్యలు చేపట్టాలి. ఇదే ఎకో వైజాగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీముకు కాసులు పంటగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దుకాణాల వద్దకు వెళ్లి చెక్ చేస్తున్నట్లు నటించి భయభ్రాంతులకు గురి చేసి భారీగా దండుకుంటున్నారు. హోటళ్లలో టిఫిన్, భోజనం.. అక్కడక్కడా మామూళ్లతో రాజభోగమే అనుభవిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరిపై ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని కోరుతున్నారు. పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు విన్నవిస్తున్నారు.

**అధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

ఎకో వైజాగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ చేస్తున్న వ్యవహారాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. 120 మైక్రాన్ మందం ఉన్న సంచులు వాడవచ్చు. అంతకంటే తక్కువ మందం ఉండే సంచులు వాడరాదు. దీనిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. తరచూ దాడులు చేస్తున్నాం. అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను జీవీఎంసీ ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. లోపాలు ఉంటే నివేదిక అందిస్తాం.

– కృష్ణంరాజు, ఏఎంహెచ్‌వో జోన్–8

## సెలవు రోజూ భాష్యం స్కూల్ నిర్వహణ

యాజమాన్యాన్ని వివరణ కోరిన విద్యాశాఖాధికారులు



పాఠశాల ఆవరణలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

విశాఖ విద్య : గోపాలపట్నం మండలంలోని బాజీ జంక్షన్‌లో గల భాష్యం స్కూల్ ఆదివారం సైతం తెరిచి విద్యార్థులతో సమావేశాలు నిర్వహించడంపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించడానికి వీల్లేదని జిల్లా విద్యాశాఖాధికారులు, మరో పక్క ఏపీఎస్‌సీపీసీఆర్ పదేపదే చెబుతున్నప్పటికీ కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారనడానికి ఇదో నిదర్శనంగా నిలిచింది. భాష్యం స్కూల్ ఆదివారం యథావిధిగా పనిచేసింది. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి... ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ పేరుతో తల్లిదండ్రులతో సమీక్షలు నిర్వహించేలా తరగతుల ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. ఆదివారం రోజు కూడా సెలవు లేకుండా పిల్లలను పాఠశాలలకు పిలపించడంపై కొంత మంది తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు 'సాక్షి' పరిశీలించింది. ఈ విషయం తెలియడంతో స్పందించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం వెంటనే ఫోన్ ద్వారా పాఠశాల యాజమాన్యంతో మాట్లాడారు. గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారులకు సైతం దీనిపై తగిన ఆదేశాలు ఇవ్వడంతో వెంటనే ఎంఈవో – 1 సోమేశ్వరరావు పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరారు. వెంటనే పాఠశాల నుంచి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పంపించేయాలని ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంఈవో సోమేశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు.

## వైద్యురాలిపై దాష్టీకం దారుణం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, ఉపాధ్యాయులు, పౌరులు

సీతమ్మధార: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన దారుణ కృత్యాన్ని వ్యతిరేకిస్తూ పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాష్టీకాలను ఖండించాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పౌర చైతన్య వేదిక నాయకులు సి.హెచ్. ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల వీరభద్రరావు, ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు కోల వెన్ను, డాక్టర్ వెంకట రమణ, సత్యవతి, పొన్నాడ శ్రీనివాసరావు, ధర్మేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రన్ ఫర్ నో డ్రగ్స్ ర్యాలీకి విశేష స్పందన




అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న అతిథులు

గాజువాక: డ్రగ్స్ వల్ల అనర్థాలపై అవగాహన కల్పించడంలో భాగంగా పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 3కే ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. రన్ ఫర్ నో డ్రగ్స్ పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని పాతగాజువాక జంక్షన్ 60 అడుగుల రోడ్‌లో ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.శ్యాంబాబు ప్రారంభించారు. పాతగాజువాకం జంక్షన్ నుంచి గాజువాక మెయిన్ రోడ్‌లో సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక వరకు, తిరిగి కణితి రోడ్ మీదుగా 60 అడుగుల రోడ్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్ మాట్లాడుతూ విశాఖ సిటీ ప్రజలు కాలుష్యానికి గురై ఇప్పటికే వివిధ జబ్బులతో బాధపడుతున్నారని, దీనివల్ల వారిపై ఆధారపడ్డ కుటుంబాలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

మద్యం, గంజాయి, డ్రగ్స్ తీసుకోవడంవల్ల విచక్షణా రహితంగా ప్రవర్తించి మానభంగాలు, హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు ప్రజల్లో చైతన్యం తేవడం కోసం ర్యాలీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్, వివిధ సంస్థలు, సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఎం.శివ గణేశ్వరరావు, పీఎస్ఎన్ మూర్తి, వినోద్ బాలు, గూడూరు సీతాలక్ష్మి, పల్లా అబిత, లత, గవర సోమశేఖర్, బండారు చందు, రమేష్, పామెల వసంత, పలక అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ శుద్ధ పంచమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో పూజారమ్మ వాసుపల్లి విజయ మ్మ అమ్మవారిని అలంకరించి, పూజలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈవో సురేష్‌బాబా పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

## ఇంకుడు గుంతలతో సమృద్ధిగా భూగర్భ జలాలు

సీతమ్మధార: ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు లేకుంటే భవిష్యత్తులో పెనుముప్పు తప్పదని సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ అధినేత సూరిబాబు తెలిపారు. జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం రెండో రోజు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అపార్టుమెంట్లు, వ్యక్తిగత నివాసాల్లో ప్రజలంతా విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు లేని పక్షంలో ఇంటి ప్లాన్ ఇవ్వకూడదని, అలాగే మున్సిపల్ కుళాయిలు మూడు నెలలు కట్ చేయాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి గెలిచిన రాజకీయ నేతలు వారి నియోజకవర్గంలో ప్రజలకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని స్వాగతిస్తున్నాం



రైల్వే స్టేషన్ వద్ద సంబరాలు చేసుకుంటున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ శ్రేణులు

తాటిచెట్లపాలెం : పాత జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ, దాని స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని శనివారం కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా రామమోహన్ రావు ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్ వద్ద యూనియన్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత దుర్మార్గమైన, సంఘటిత రంగంలోని కార్మికుల సామాజిక భద్రతకు సవాలుగా నిలిచిన పాత జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రైల్వే మెన్స్ ఫెడరేషన్, తమ యూనియన్ జరిపిన రాజీలేని పోరాటానికి కేంద్రం దిగి వచ్చిందని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జోనల్ నాయకులు పీకే పట్నాయక్ నాయకత్వంలో చేపట్టిన నిరసనలు, ఆందోళనల ఫలితమే యూనిఫైడ్ పెన్షన్ స్కీం అని వక్తలు తెలిపారు.

ఈ పెన్షన్ స్కీం వల్ల యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరడానికి ఆసక్తి చూపిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మరిన్ని పోరాటాలు చేసేందుకు కార్మికులు సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు. సంబరాల్లో కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, శ్రామిక్ యూనియన్ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతమ్మధార: ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ లంకలపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో నగరానికి చెందిన విద్యావేత్తలు, భాషాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యా విధానంపై ప్రకటన చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టం – 2010 ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించాలన్నారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రజలకు హక్కులతోపాటు బాధ్యతలూ ఉన్నాయని, వాటిని తెలుసుకోవాలన్నారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను తప్పనిసరిగా మాతృభాషలోనే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యమూర్తి, పి.కన్నయ్య, వేదుల కామేశ్వరరావు, మేడ మస్తాన్ రెడ్డి, హుస్సేన్, చాట్ల బాబురావు రెడ్డి, సుజాత, బ్రహ్మకుమారి, రామేశ్వరి పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహనాల తనిఖీలు



వాహన పత్రాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

విశాఖ విద్య: ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వెళ్లే బీఆర్టీసీ దారిలో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. ట్రాఫిక్ ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనదారులను నిలిపి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు ఉందా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. హెల్మెట్ ధరించకుండా వెళ్తున్నవారిని నిలిపి జరిమానా విధించారు. నిబంధనల మేరకు ప్రతీ ఒక్కరూ హెల్మెంట్ ధరించాల్సిందేనని చెప్పారు. పెండింగ్ జరిమానాలు ఉన్న వాహనాలను గుర్తించి వారి నుంచి రికవరీ చేశారు. కానిస్టేబుల్ రమణ , సిబ్బంది పాల్గొన్నారు.

## కంటిపై ఒత్తిడి తగ్గించాలి



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్: జ్ఞానేంద్రియాల్లో అతి ముఖ్యమైన కంటిపై ఒత్తిడి తగ్గించాలని శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ శశి, సమృద్ధి, ఆర్.దేశ్‌ముఖ్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ఏడాదికోసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 174 మందికి వైద్య పరీక్షలు చేయగా వారిలో 36 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సిఫారసు చేశారు. అనంతరం వైద్యులను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వారాజు, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు పాల్గొన్నారు.

## అందొచ్చిన కొడుకు అనంత లోకాలకు..

- బైక్ ఢీకొని మృతి



శ్రీనివాసరావు (ఫైల్)



కనకల శ్రీనివాసరావు మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పద్మనాభం: చేతికి అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రుల శోకానికి అవధులు లేకుండా పోయింది. కుమారుడు తమను ఆదుకుంటాడనుకున్న తల్లిదండ్రుల ఆశలను మృత్యువు అడియాశలు చేసింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ జిల్లా ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల శ్రీనివాసరావు(36) పని మీద శనివారం ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లాడు. పని ముగించుకుని అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బోని వస్తుండగా.. మార్గం మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పద్మనాభం మండలం విజయానందపురం జంక్షన్ వద్ద చెరువుకు సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై భార్య శ్రీవలికతో కలిసి వస్తున్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఆర్.వి.అగ్రహారానికి చెందిన లెక్కల సతీష్.. శ్రీనివాసరావును ఢీకొట్టాడు. అతడి తలకు బలమైన గాయాలవ్వడంతో 108 అంబులెన్స్‌లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో సతీష్, శ్రీవలిక దంపతులకు గాయలవ్వడంతో అదే ఆస్పత్రిలో చేర్పించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు.

**తల్లిదండ్రులకు శ్రీనివాసరావే ఆధారం**

మృతుడు కనకల శ్రీనివాసరావుకు తండ్రి సీతారాం, తల్లి రమణ, చెల్లి అప్పలకొండ, అక్క ఆదిలక్ష్మి ఉన్నారు. అక్క, చెల్లిల వివాహాలు జరిగి అత్తవారింటి వద్ద ఉంటున్నారు. శ్రీనివాసరావు ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. శ్రీనివాసరావు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో శ్రీనివాసరావును తిరిగిరాని లోకాలకు తీసుకుపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

## సిటిజన్స్ కప్ విజేతలకు బహుమతులు



విజేతలతో సంస్థ సభ్యులు

కంచరపాలెం : రాబిన్ హుడ్ ఆర్మీ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కైలాసపురం డీఎల్‌బీ మైదానంలో ఆటల పోటీలు నిర్వహించారు. సిటిజన్స్ కప్ విజేతలుగా సింగమాంబ ఫుట్‌బాల్ టీం, రన్నర్స్‌గా వెంకట ఎఫ్‌సీ టీం నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి చిన్నారులకు నోట్ పుస్తకాలు, ప్లాంకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాబిన్స్ ప్రసాద్, దొడ్డి సంజీవ్‌కుమార్, ఇమ్రాన్, గుప్తా ప్రసాద్, స్వాతి, శంకర్, అశోక్, దీపక్, కోచ్‌లు పాండు, గిరి పాల్గొన్నారు.